క్లుప్తంగా

రేపు ఐక్య ప్రజాస్వామ్య సమ్మేళనం

కడప రూరల్ : రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే ఐక్య ప్రజాస్వామ్య సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జాతీయ సమన్వయకర్త సంగటి మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భారత రాజ్యాంగం ఆమోదం పొంది ఈనెల 25వ తేదికి 75వ సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఐక్య ప్రజాస్వామ్య సమ్మేళనం నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి అభ్యుదయవాదులు, ప్రజా సంఘాల నేతలు హాజరు కావాలని ఆయన తెలిపారు.

చిన్నారులకు చలి కోట్లు, స్వీట్లు పంపిణీ



చలి కోట్లు అందుకున్న చిన్నారులతో దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : స్నేహం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడపకు చెందిన చిన్నారి దేవ హర్ష జన్మదిన సందర్భంగా పేద పిల్లలకు తమవంతుగా తోడ్పాటు అందించారు. ఆదివారం నగరంలోని అర్బన్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న చిన్నారులకు పది వేల రూపాయల విలువగల చలి కోట్లను, స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవ హర్ష తల్లిదండ్రులు రాజా, పావని, స్నేహం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రసన్న, వెంకట రమణరాజు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాధవరం చేనేతలతో జిల్లాకు ఖ్యాతి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఇంటాక్ సభ్యులు

కడప కల్చరల్ : జిల్లాలో నేతన్నలు ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన చేనేతలు ఎంతో ఖ్యాతి గడించి పెట్టాయని, అందులో మాధవరం చేనేతలు ముఖ్యమైనవని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ(ఇంటాక్) జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాలలో భాగంగా ఆరవరోజు ఆదివారం కడపనగరం నేక్ నామ్ ఖాన్ కళాక్షేత్రంలోని మాధవరం చేనేత వస్త్రాల ప్రదర్శన స్టాల్స్‌ను ఇంటాక్ ఇతర సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. స్టాల్స్ మేనేజర్ సత్యనారాయణ ఇంటాక్ సభ్యులకు రాయలసీమ ప్రాంతంలో చేనేతలకు పేరుగాంచిన మాధవరం వస్త్రాల స్టాల్స్‌లోని వస్త్రాల వివరాలను తెలియజేశారు . రాయలసీమలో అనంతపురం ధర్మవరం పట్టు వస్త్రాలకు, మన జిల్లాలోని మాధవరం చేనేత వస్త్రాలకు పేరు గాంచాయన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ఆరు రోజులు ఆరు వారసత్వ కళలపై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించామని ముగింపు కార్యక్రమాన్ని సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తామని తెలిపారు. మేనేజర్ సత్యం మాట్లాడుతూ మిషన్ మగ్గాలపై తయారు చేసే వస్త్రాల కంటే చేనేతలను ప్రోత్సహించవలసిన అవసరం ఉందన్నారు. ఈనెల ఒకటి వరకు ఈ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో లయన్ పోతుల వెంకటరామిరెడ్డి భోగాల కొండారెడ్డి సుగవాసి గంగాధర్ డాక్టర్ జీవీ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆటా పాట అదుర్స్



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు చిన్నారులు తమ ఆటపాటలతో అదుర్స్ అనిపించారు. స్థానిక విజిల్స్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాలను శిల్పారామాల పాలనాధికారి శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

ఆచారం వెనుక ఆరోగ్యం...ఆనందం



నదీ స్నానం చేస్తున్న భక్తులు (ఫైల్)



వన భోజనాలు చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : పండుగలు కేవలం ఆనందాన్నే కాకుండా మన ఆచారాలు, సంప్రదాయాలను మరోమారు గుర్తు చేస్తాయి. ముఖ్యంగా పండుగల సందర్భంగా సంస్కృతి సంప్రదాయాలను ప్రజలు తప్పక పాటిస్తుంటారు. అందులో ఒకటి కార్తిక మాసం. ఈ మాసం శైవులకే కాకుండా వైష్ణవులకు కూడా అత్యంత ఇష్టమైనది. ఈ మాసాన్ని ఎంత పవిత్రంగా భావిస్తారో తెల్లవారుజామునే నదీ స్నానాలు చేయడం, వన భోజనాలు, ఉసిరి చెట్ల కింద భోజనం చేయడం తదితరాలు ఈ మాసంలోని ప్రత్యేకతగా భావిస్తారు. నిజానికి ఈ సంప్రదాయాలు అటు సామాజికంగా, ఇటు శారీరకంగా ఎంతో ఉపయుక్తమైనవని పెద్దలు చెబుతారు. ఈ సంప్రదాయాల వెనుక ఆరోగ్యపరమైన విశేషాలు ఎన్నో ఉన్నాయని తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి.

నదీ స్నానం

కార్తిక మాసంలో నదీ స్నానం అత్యంత ముఖ్యమైనదని, పుణ్యదాయకమని భావిస్తారు. ఈ మాసానికి ముందు వరకు వర్షాలు కురిసి ఉంటాయి గనుక ఊరి బయట మైదానాలలో పచ్చిక కలిగి ఉంటుంది. కొండ కోనలు, అక్కడి భారీ వృక్షాలు, పొదలు, మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతుంటాయి. వీటిలో కొన్ని ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. నదుల ఒడ్డున ఉండే చెట్లు, మొక్కలు కూడా ఆరోగ్యంగా ఎదిగి ఉంటాయి.నదీజలం వాటిని ఒరుసుకుని వచ్చేటపుడు ఆ నీటికి ఔషధ గుణం లభిస్తుంది. నదీ జలాలలో సూర్యోదయానికి ముందే స్నానం చేయడం పలు చర్మ వ్యాధుల నుంచి రక్షిస్తుందని తెలుపుతారు. ఈ ప్రక్రియ శారీరక సమతౌల్యానికి ఉపయోగపడుతుందని పేర్కొంటారు. ఈ మాసంలో పగలంతా ఎండ చుర్కుమంటూ ఉంటుంది. ఎండకు కాగిన నదుల్లోని నీరు రాత్రి చలికి చల్లబడుతుంది. దీంతో ఆ నీటికి కాచి చల్లార్చిన గుణం ఉంటుంది గనుక ఇలాంటి నీటిలో స్నానం చేయడం శుద్ధ, ఔషధ జలంతో స్నానం చేసిన ఫలితం లభిస్తుంది.

ఆధ్యాత్మికతత్వం

వర్షాకాలం సందర్భంగా కొండ కోనల్లో దండిగా నీరు చేరి లోయల్లోకి అటు నుంచి నదుల్లోకి నీరు వస్తుంది. సెలయేరు రూపంలో అటవీ ప్రాంతంలోని ఔషధ మొక్కలను ఒరుసుకుని ఔషధ గుణాలతో వచ్చే నీరు చదుల్లో కలుస్తుంది. నదులు చివరికి సముద్రుడిని చేరతాయి. దీన్ని మానవ జీవితం ఆరోగ్యపరంగా కూడా పెద్దలు విశ్లేషిస్తారు. మనిషి ఎంత గొప్పస్థాయిలో పుట్టినా...అంతకంటే గొప్పగా జీవించినా చివరికి ఆధ్యాత్మిక చింతనతో దైవ కృప కోసం ప్రయత్నిస్తాడు. దైవ సన్నిధికి చేరుకోవడమే పరమావధిగా భావిస్తాడు. కార్తీక మాసం సంప్రదాయాల్లో ఈ తత్వం కూడా దాగి ఉంది.

ఉసిరి ప్రాధాన్యత

ఈ మాసంలో ఉసిరి కాయలు ఎక్కువగా లభిస్తాయి. ఆయుర్వేద పరంగా ఉసిరిని ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈ మాసంలో ప్రతి సోమవారం ఉదయం, సాయంత్రం శివాలయ ప్రాంగణాలలో కార్తీక దీపాలలో భాగంగా ఉసిరి దీపాలను కూడా వెలిగిస్తారు. ఉసిరిని ఆరోగ్య సిరిగా కూడా భావిస్తారు. ఉసిరిలో పుష్కలంగా సి–విటమిన్ ఉంటుందని, దాన్ని ఆహారంగా స్వీకరిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పెద్దలు చెబుతారు. ప్రతిరోజు కనీసం ఒక్క ముద్ద అన్నంలో ఉసిరికాయ లేదా ఉసిరి పచ్చడితో తింటే శారీరక అనారోగ్యాలు తగ్గుతాయంటారు. ఉసిరికి నోటి పూతను తగ్గించే గుణం ఉంది. తల వెంట్రుకలు బాగా పెరగాలన్నా.....శిరోజాల ఆరోగ్యం బాగుండాలన్నా...ఆమ్ల ఆయిల్ (ఉసిరి నూనె) వాడటం మంచిదంటారు. ఈ సీజన్‌లో వచ్చే శీతవాతాలు, కఫ, శ్లేష్మ,పిత్త దోష నివారణ ఉసిరి వాడకంతో తగ్గుతుంది. కానీ ఉసిరి కాయను రాత్రి పూట తినకూడదని కూడా పెద్దలు హెచ్చరిస్తున్నారు.

వన భోజనం...ఐక్యతా రాగం

రోజురోజుకు మానవ సంబంధాలు తగ్గిపోతున్న ఈరోజుల్లో కార్తీక మాసంలో లభించే వన భోజనాల అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని మానవతా వాదులు సూచిస్తున్నారు. బంధుమిత్రులు, హితులు, స్నేహితులు ఒకచోట కూడి ఉదయం నుంచిసాయంత్రం అందరూ కలిసిమెలిసి ఆనందంగా గడుపుతూ ఆత్మీయతను పెంచుకునే అవకాశం వన భోజనాల ద్వారానే లభిస్తుందంటారు. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు లాంటి కృత్రిమ వాతావరణానికి అలవాటుపడిన నేటి ప్రజలు సంవత్సరంలో కనీసం ఇలాంటి సందర్భాల్లోనైనా ఆరుబయట సహజమైన వాతావరణం, గాలి, వెలుతురులను ఆస్వాదించాలని సూచిస్తున్నారు. నేటి బిజీ జీవితాలలో ఒకరికొకరు కనీసం ఐదు నిమిషాలైనా తీరిగ్గా మాట్లాడి వారి మంచి చెడులను తెలుసుకునేందుకు కూడా వన భోజనాలు తోడ్పడతాయి. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి అయినా వ్యక్తులు మానసికంగా రోజురోజుకు దూరమవుతున్నారు. అలాంటి లోటును వన భోజనాలు తీరుస్తాయి. రోజంతా అందరూ ఒకచోట కలిసి ఒకరినొకరు సమస్యలను తెలుసుకుని పరిష్కారాలను ఆలోచించే అవకాశం లభిస్తుంది.

గిరిజన ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి



గిరిజన సంక్షేమ సంఘం డైమండ్ జూబ్లి ఉత్సవాల్లో నాయకులు

కడప రూరల్ : గిరిజన ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పీవీ రమణ, రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పి.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం గిరిజన సంక్షేమ సంఘం డైమండ్ జూబ్లి ఉత్సవాలను స్థానిక యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులు గిరిజన వర్గాల అభ్యున్నతికి వారిని చైతన్యవంతులను చేయడానికి కృషి చేయాలన్నారు. ఐకమత్యంగా ఉండడం ద్వారానే హక్కులను సాధించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా బాబు నాయక్, సహా అధ్యక్షులుగా డాక్టర్ బి.మధుసూదన్, గంగాధర్, రామకృష్ణ, కె.బాలసుబ్బయ్య, శ్రీనివాసులు, ఓబిలి రమేష్‌తోపాటు 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ప్రభాకర్, కొండయ్య, సోగాల కమలాకర్, జిల్లా అధ్యక్షుడు కొండయ్య, పెనుగొండ కృష్ణ, డాక్టర్ శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధన్యజీవి కామ్రేడ్ లింగమూర్తి



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బతికిన కాలం పేదల కోసం, ప్రాంతం అభివృద్ధి కోసం కోసం పనిచేస్తే మరణించినా జీవించే ఉంటారు. జీవించు సాధించు, మరణించు జీవించు అన్న విధంగా లింగమూర్తి బతికిన కాలం ఎంతో ఘన కీర్తిని సంపాదించారని వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని నూర్జహాన్ కళ్యాణ మండపంలో కామ్రేడ్ లింగమూర్తి సంస్మరణ సభ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ లింగాల మండలంలో అత్యంత ధనవంతుల కుటుంబాలలో లింగమూర్తి ఒకడిని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంతో అత్యంత అవినాభావ సంబంధాలు ఉండేవన్నారు. నేను మేయర్‌గా, ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో అనేక సందర్భాలలో కలసి సమస్యలపై చర్చించే వారన్నారు. ఆయన యావత్ ఆస్తిని ప్రజల కోసమే దారపోసారని, నిరంతరం ప్రజా సమస్యల పైనే దృష్టి సారించేవారన్నారు. 84 ఏళ్ల వయసులో కూడా ఆయన ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడం విశేషం అన్నారు. కమ్యూనిస్టు పార్టీకి నాలుగవ మూల స్తంభమైన స్టాలిన్‌తో రష్యాలో ప్రత్యక్ష సమావేశమైన వారిలో లింగమూర్తి ఒకరిన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తులసిరెడ్డి, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్, నాయకులు మగ్బూల్ బాషా, రామకృష్ణారెడ్డి, సిద్ధిరామయ్య, చాపల సుబ్బరాయుడు, లక్ష్మీదేవి తస్లీమ్, మడగలం ప్రసాద్, వెంకటేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి పట్టం కట్టిన 'మధురాంతకం'



వక్త సుందరేశ్వరరావును సత్కరిస్తున్న బ్రౌన్ సిబ్బంది తదితరులు

కడప కల్చరల్ : ప్రముఖ రచయిత, కథకులు మధురాంతకం రాజారాం మనిషిని కేంద్రబిందువుగా చేసుకొని మానవత్వానికి పట్టం కట్టారని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ కెఎస్ సుందరేశ్వరరావు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం 138వ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధురాంతకం రాజారాం బాల్యం, విద్యాభ్యాసం, సాహిత్య పరిచయం తదితర అంశాలను వివరించారు. ఆయన సామాన్యుడికి మంచి జరగాలన్న ధ్యేయంతో రచనలు చేశారన్నారు. శతాధిక రచనలు చేసిన మంచి రచయితగా పేరొందన్నారు. ఫ్యూడల్ భావజాలాలు లేని ఇతివృత్తాలను కథలుగా మలిచిన ఉత్తమ స్థాయి కథకుడని కొనియాడారు. ఆయన సుమారు 300కు పైగా కథలు, రెండు నవలలు, నవలికలు, నాటకాలు, గేయాలు, సాహితీవ్యాసాలు రచించారని, తమిళ రచనలను తెలుగులోకి అనువదించారన్నారు. 1993లో 'మధురాంతకం రాజారాం కథలు' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వక్తను బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎస్.రమేశ్‌రావు, జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, సిబ్బంది సత్కరించారు.

రైతు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష అనుబంధ సంఘాల నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కెసీ బాదుల్లా పేర్కొన్నారు. ఆదివారం దేశ వ్యాప్త నిరసనలో భాగంగా కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా జిల్లా కేంద్రాలలో ఈనెల 26 దేశ వ్యాప్త నిరసనలో పిలుపునిచాచయి. అందులో భాగంగా నగరంలోని కళాక్షేత్రంనుంచి ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన ధర్నాకు పెద్ద సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ నగరంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కార్మికులు మరింత పేదరికంలోకి నెట్టబడడానికి మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమని తెలియజేశారు. ఇదే సందర్భంలో కార్పొరేట్లకు రూ.12 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి ప్రపంచ కుబేరుల స్థానంలో అదానీ, అంబానీలు ఎదగడానికి మోదీ ప్రభుత్వం నిస్సిగ్గుగా సహాయపడుతుందన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలు చెల్లించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మికులను బానిసత్వం నుండి విడుదల చేయాలన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, నష్టపరిహారం చెల్లించాలన్నారు. విశాఖ ఉక్కు, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులు నిరుద్యోగులతో తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, శ్రీనివాసులు రెడ్డి, సుబ్రమణ్యం వెంకట శివ, మద్దిలేటి, చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు ఆర్జిత సెలవులు ఇవ్వాలి

–డీఈఓకు హెచ్‌ఎంల అసోసియేషన్ వినతి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న హెచ్‌ఎంల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 2021–22 నుంచి 2023–24 విద్యా సంవత్సరంలో వేసవిలో పనిచేసిన ప్రధానోపాధ్యాయులకు ఆర్జిత సెలవులను మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రావు కోరారు. ఈ విషయమై డీఈఓ మీనాక్షిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పాఠశాలల పనివేళలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని హెచ్‌ఎం సంఘం వ్యతిరేకిస్తుందన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న నైట్‌వాచ్‌మెన్‌కు ఇవ్వాల్సిన రెమ్యూనేషన్‌ను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ విజయ్‌బాస్కర్‌రెడ్డి, పులివెందుల డివిజన్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

బంధాలను కలిపిన 'మన భోజనాలు'



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



వన భోజన కార్యక్రమంలో పద్మశాలీ సంఘ నేతలు

కడప కల్చరల్ : మన భోజనాలు...మనకోసం కాకుండా అందరం కలిసి ఒకచోట ఆనందాలను పంచుకునే జనాలు... మమతానుబంధాలను కలుపుకుని ఎవరికి వారు కాకుండా మనం అన్న భావనతో కలిసి మెలిసి గడిపే వన భోజనాలు కార్తిక మాసం ప్రజలకు అందించే అపురూపమైన వరం.

పద్మశాలీయుల ఐక్యత

కడప నగరం చెన్నైరోడ్డులోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం కార్తిక వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా వారి కుల దైవమైన శ్రీ భద్రావతి భావనారుషి స్వాములవారి కల్యాణాన్ని నయన మనోహరంగా నిర్వహించారు. సంగం అధ్యక్షులు ఆవ్వారు వెంకటసుబ్బయ్య, సుబ్బారాయుడు, పద్మశాలీయ సేవా సంఘం సభ్యులు, యువజన విభాగం సభ్యులు కార్యక్రమాన్నిపర్యవేక్షించారు. కుల సంఘం ప్రముఖులు పాకా సురేష్ కుమార్, గునిశెట్టి సాయి కుమార్, ఆవ్వారు రాజేష్, మంచా సాయి తదితరులు పాల్గొన్నారు.

భట్రాజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

ఆదివారం కడపనగరంలోని చలమారెడ్డిపల్లె ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌లో భట్రాజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ మానవ సంబంధాలు అంతరించిపోతున్న సమయంలో కార్తిక వనభోజనాల ద్వారా అందరూ ఐకంగా ఉండే అవకాశం లభించిందన్నారు. ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో ఆహారంతో పాటు ఆనందాన్ని పంచుకుని కలిసిమెలిసి ఆరగించడం అపురూపమైన అనుభూతిని ఇస్తోందని తెలిపారు. ఈ ఐక్యత శుభపరిణామమని, కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమాలను సంఘం ప్రధాన కార్యదర్శి అవధానం రఘురామరాజు, అధ్యక్షుడు చంద్రమోహన్‌రాజు, గౌరవ అధ్యక్షులు ఓంకారం జనార్దన్ రాజులు పర్యవేక్షించారు. వందన డాన్స్ అకాడమీ డైరెక్టర్ పాలగిరి వందన ఆధ్వర్యంలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ క్రమంలో సంఘం నాయకులు మునిశేఖర్ రాజు, దేవేంద్ర రాజు, బాలగిరి రామ్మోహన్రాజు, మాచిరాజు సుబ్బరాజు, డాక్టర్ పాలగిరి రమేష్ రాజు, శంకర్ రాజు,, యాంకర్ మహేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వనభోజనం మంచి సంప్రదాయం

కడప కార్పొరేషన్: కార్తిక మాసం సందర్భంగా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఎక్కడెక్కడో ఉన్న పద్మశాలీ కులస్తులంతా ఒకచోట కలుస్తారన్నారు. ఈ వన భోజనాల వల్ల కొత్తవారు పరిచయం అవుతుంటారని,ఒకరికొకరి మధ్య మంచి సంబంధాలు ఏర్పడుతాయన్నారు. సంఘం ఆధ్వర్యంలో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

పైపులైన్ పునరుద్ధరణ

– గౌస్‌నగర్ వాసులకు తీరిన దాహార్తి



మరమ్మతులు చేసిన పైపులైన్

సాక్షి ఎఫెక్ట్..

కడప ఎడ్యుకేషన్: కడప నగరం 27వ డివిజన్‌లోని గౌస్‌నగర్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో గౌస్‌నగర్ వాసులకు మంచినీరు అందకుండా పోయింది. గౌస్‌నగర్ వాసులకు కార్పొరేషన్ అధికారులు ట్యాంకర్ల నీరును సరఫరా చేసేవారు. అయితే అక్కడ జనాభా అధికంగా ఉండటంతో ఈ నీరు సరిపకడ చాలా ఇబ్బంది పడ్డారు. ఈ విషయమై ఆదివారం సాక్షిలో ×గౌస్‌నగర్ వాసులకు తాగునీటి కష్టాలు£ అనే వార్తను ప్రచురితం చేసింది. స్పందించిన కార్పొరేషన్ అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేసి గౌస్‌నగర్ వాసులకు మంచినీటిను పునరుద్ధరించి దాహార్తిని తీర్చారు.

యాదవ మహా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఓబులేసు

కడప ఎడ్యుకేషన్: అఖిల భారత యాదవ మహా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా డి.ఎం. ఓబులేసు యాదవ్ ఎన్నికయ్యారు. ఆదివారం రాయచోటిలో జరిగిన యాదవుల సమైక్య సభలో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఓబులేసు యాదవ్‌ను ఎన్నుకున్నారు.

రాజకీయంగా రాణిస్తేనే విలువ

– కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

కడప కల్చరల్ : తొగట వీర క్షత్రియులు ఒకరికొకరు సహకరించుకుంటూ రాజకీయంగా ఎదగాలని, అప్పుడే వారికి సమాజంలో విలువ పెరుగుతుందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఆదివారం కడప నగర శివార్లలోని కనుమలోపల్లి 108 శివలింగాల మహాలింగేశ్వర స్వామి సన్నిధిలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో కార్తిక మాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ ఒకే నాయకత్వం కింద పని చేస్తే రాజకీయంగా ఎదిగే అవకాశం ఉందని, రాజకీయ పార్టీలు కూడా అలాంటి వారిని గుర్తించి పెద్దపీట వేస్తాయన్నారు. రాష్ట్రంలో తొగట వీర క్షత్రియ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు కళ్యా సుధాకర్, పల్లా నరసింహారావులు మాట్లాడుతూ సంఘం తరఫున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఐక్యమత్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. పిల్లలకు పెద్దలకు ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంఘం మహిళ అధ్యక్షురాలు సురువు శ్రీలత, రాయలసీమ అధ్యక్షులు బొమ్మల వెంకటరత్నం బండారు సూర్యనారాయణ, ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, టేకూరు సుదర్శన్, పల్లా మురళి కృష్ణయ్య, చౌడం సూరిబాబు, సుంకర రామచంద్రుడు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



పలిశెట్టి దామోదర్ రావుకు వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజపతి, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గంగాంజనేయు కోరారు. ఈ మేరకు ఆదివారం వారు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్ రావును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా ఆర్టీసీలో పనిచేస్తున్న సుమారు 8000 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ విధానం రద్దుచేసి అప్కాస్‌లో ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులను చేర్పించేలా చూడాలన్నారు. అలాగే ఇన్సూరెన్స్‌ను ఆర్టీసీ సంస్థ ద్వారానే చెల్లించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆర్టీసీ ఇచ్చిన కాంప్లిమెంటరీ బస్సు బస్సు పాసులను దూర ప్రాంతాల నుంచి వస్తున్న కార్మికులకు కూడా వర్తింప జేసి న్యాయం చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఈయూ నాయకులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

5న బర్సీ మహోత్సవం

కమలాపురం : కమలాపురం పెద్ద దర్గాగా విరాజిల్లుతున్న హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం డిసెంబర్ 5వ తేదీన వైభవంగా నిర్వహించనున్నామని దర్గా కన్వీనర్, వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు గంధం ఊరేగింపు నిర్వహిస్తామని అనంతరం ప్రత్యేక ఫాతెహా నిర్వహిస్తామన్నారు. తదనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఐడియా అదిరింది .. నానో మారింది

మేధస్సుకు మించిన ఆలోచన విధానం వారి జీవన శైలిని మారస్తుందనడానికి ఈ చిత్రం నిదర్శనం. కడప నగరం చిన్నచౌకుకు చెందిన ఓ రైతు తన వ్యవసాయ పనిముట్లు నగరానికి తీసుకు వచ్చేందుకు రాను, పోను రవాణా ఖర్చులు ఎక్కువ కావడంతో ఇంటిలో నిరుపయోగంగా ఉన్న టాటా నానో కారును ట్రాలీగా మార్చేందుకు ఆలోచన రావడంతో రూపకల్పన చేశాడు. దాంతో ఇంటి పనులు, వ్యవసాయ పనులకు ఉపయోగపడేలా కారును వాడుతుండడంతో ఆ దృశ్యాన్ని చూసిన వారు ప్రశంసిస్తున్నారు. ఆ దృశ్యాలను కలెక్టరేట్ వద్ద సాక్షి కెమెరా బంధించింది.

– సాక్షి సీనియర్ ఫోటోగ్రాఫర్, కడప



